క్లుప్తంగా

వైభవంగా గంధోత్సవం

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామంలో వెలసిన శ్రీ సయ్యద్ షా ఆలంపీర్ స్వామి వారి గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వాహకులు గండ్లూరి పెద్దవీరారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మయ్యశెట్టి నివాసం నుంచి గంధంను ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. గంధం దర్గా చేరుకున్న అనంతరం స్వామి వారి మజార్‌పై ఎక్కించారు. పూల చాదర్లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం భక్తులకు గంధం పంచి పెట్టారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి



వేసవి శిబిరంలో విద్యార్థులు, అతిథులు

పోరుమామిళ్ల : విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని అప్పుడే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగయ్య పేర్కొన్నారు. స్థానిక లైబ్రరీలో లైబ్రేరియన్ ఆఫ్రిది, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిబిరంలో శనివారం ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు విద్య పట్ల, భాష పట్ల, గ్రంథాలయం పట్ల అవగాహన కల్పించారు. ఆంగ్లంలో పట్టు సాధిస్తే మిగతా సబ్జెక్టుల్లోనూ ముందుంటారన్నారు. విశ్రాంత డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మార్కారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపీర్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో గేయాలు, పద్యాలు, కథలు, డ్రాయింగ్ నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీర్‌బాషా, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం



భోజనం వడ్డిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. బీసీ నాయకుడు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం మూడేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులో అన్వర్ థియేటర్ వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ చల్లా రాజగోపాల్ తన తండ్రి చల్లా శివరామయ్య జ్ఞాపకార్థం ప్రతి శనివారం, ప్రతినెల పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు ఆనంద భార్గవరెడ్డి, కౌన్సిలర్ మహ్మద్ గౌస్, బాబు, పెంచలయ్య, వెంకటకృష్ణయ్య యాదవ్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నివాళి



క్రిష్ణయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : అనారోగ్యంతో మృతిచెందిన అట్లూరు దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈరిక్రిష్ణయ్య మృతదేహానికి బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ శనివారం సాయంత్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రిష్ణయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకుని ఎమ్మెల్యే మృతుని నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోవిళ్ల చిన్నసూరారెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్‌కు పరామర్శ



తిరుపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, ఎంపీపీ

ప్రొద్దుటూరు : కొత్తపల్లె గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ తిరుపాల్‌రెడ్డి ప్రమాదవశాత్తు కింద పడటంతో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యూత్ ఇన్‌చార్జి ద్వార్శల గురునాథ్ రెడ్డి, సెల్ సుబ్బయ్య పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం అగస్త్యేశ్వరస్వామి

- నాలుగు గాలిగోపురాలు ఈ ఆలయ ప్రత్యేకత
- నేటి నుంచి వైభవంగా బ్రహ్మోత్సవాలు



అగస్త్యేశ్వరస్వామి మూలవిరాట్



రాజరాజేశ్వరి అమ్మవారు



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవాలయాలు మన సంస్కృతి, నాగరికతలకు నిలయాలుగా భాసిల్లుతున్నాయి. పట్టణ నడి బొడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయం ప్రాచీన ఆలయాల్లో ఒకటి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు ప్రసిద్ధి చెందారు. పూర్వం అగస్త్య మహాముని ఈ ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ ఆలయంలోని శివలింగం అగస్త్యేశ్వరస్వామిగా పిలవబడుతూ భక్తుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్నారు. ఈ ఆలయాన్ని 8వ శతాబ్దంలో తెలుగు చోళరాజు నిర్మించారు. 1498వ సంవత్సరంలో విజయనగర రాజు ఉమ్మడి నరసింహరాయల సైనికాధికారి నరసానాయకుడు అగస్త్యేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 1966లో కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి, 1988లో జయేంద్ర సరస్వతి అగస్త్యేశ్వరస్వామిని సేవించి రాజగోపురంపై బంగారు కలశాల ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. తూర్పు రాజగోపురంపై పుష్పగిరి పీఠాధిపతి విద్యానృసింహ భారతీస్వామి వారు బంగారు కలశాలను ప్రతిష్ఠించారు. ఉత్తర దక్షిణ రాజగోపురాలపై బంగారు కలశాలను శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి ప్రతిష్ఠ, కుంభాభిషేకాలను చేశారు. ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ సప్తమి నుంచి పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. అలాగే దేవీ శరన్నవ రాత్రులను ఘనంగా నిర్వహిస్తారు.

'శివతాండవం'కు స్ఫూర్తి ఈ అగస్త్యేశ్వరుడే

14 భాషల్లో నిష్ణాతులైన శతాధిక గ్రంథకర్త పుట్టపర్తి నారాయణాచార్యులకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు తెచ్చిన 'శివతాండవం' కావ్య సృష్టికి మూలం ఈ ఆలయంలోని అగస్త్యేశ్వరుడే. నారాయణాచార్యుల వారు ఆలయంలో కూర్చుని అంతర్గతంగా స్వామి వారిని దర్శిస్తూ అమితానందం పొందేవారు. రోజూ స్వామివారి చుట్టూ 101 ప్రదక్షిణలు చేసి శివతాండవం కావ్యాన్ని రచించారు. ఆలయ ప్రాంగణంలో పుట్టపర్తి నారాయణా చార్యుల స్మృతికి చిహ్నం ఏర్పాటు చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఈ నెల 4 నుంచి 15 వరకు అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలకమండలి సభ్యులు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు అలంకరణ, వాహనోత్సవం, సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ, సోమవారం సాయంత్రం శివపార్వతుల కల్యాణం, 6న సింహవాహనం, 7న శేష వాహనం, 8న రావణ బ్రహ్మ వాహనం, 9న హంస వాహనం, 10న నంది, గరుడ వాహనాలు, 11న గజ వాహనం, 12న రథోత్సవం, 13న వసంతోత్సవం, ధ్వజారోహణం, అశ్వ వాహనం, అన్నప్రసాద వితరణ, 14న పవళింపు సేవ, 15న శాంత్యుత్సవం నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మల్లికార్జున శెట్టి, ఎక్స్‌అఫిషియో మెంబర్ మహేశ్వరశర్మ, సభ్యుడు వెంకటరామయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖ మాసం ప్రారంభం సందర్భంగా శనివారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. లక్ష్మీనరసింహస్వామి మండల దీక్ష పూజా కార్యక్రమాన్ని ఆలయ పూజారి పెంచలయ్యస్వామి ప్రారంభించారు. ఈనెల 10వ తేదీ శనివారం శని త్రయోదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక తైలాభిషేకం, నిజరూప దర్శనం ఉంటుందన్నారు. 11 నుంచి 13వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావాలని కోరారు.

ఖాజీపేట వరుస చోరీల కేసులో పురోగతి

ఖాజీపేట : ఖాజీపేటలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో అలాగే బస్టాండ్ మెయిన్ సెంటర్‌లోనే చోరీలు చేసి దర్జాగా వెళుతుండటంతో ఆందోళన అధికమైంది. ఈ చోరీలు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారాయి. దీన్ని ఛాలెంజ్‌గా తీసుకుని దొంగల కదలికలపై నిఘా ఉంచి ఎట్టకేలకు వారిని అదుపులోకి తీసుకుని కేసుల కూపీ లాగే ప్రయత్నం చేస్తున్నారు.

ఖాజీపేట మండలంలో గత 8 నెలల్లో జరిగిన చోరీలను పరిశీలిస్తే సుమారు 30కి పైగానే జరిగినట్లు తెలుస్తోంది. అందులో ఖాజీపేట బస్టాండ్ కూడలిలో ఒకే రోజు ఏకంగా ఏడు చోట్ల చోరీ జరిగింది. అలాగే పోలీస్ స్టేషన్‌కు అనుకుని ఉన్న ఎస్‌బీఐలో ఏటీఎం చోరీకి దొంగలు ప్రయత్నించి విఫలమయ్యారు. దీనికితోడు బస్టాండ్ కూడలిలో వీఎస్ జ్యువెలర్స్ దుకాణంలో వెండి ఆభరణాలు చోరీ చేశారు. అలాగే సన్నపల్లెలో చోరీ, దుంపలగట్టు గ్రామంలో చోరీతోపాటు ఆలయాల్లో చోరీలు ఇలా అన్ని సంఘటనలు అందరిని ఆందోళనకు గురిచేశాయి.

పోలీసుల అదుపులో దొంగలు..

ఖాజీపేట బస్టాండ్ కూడలిలోని బంగారు అంగడిలో జరిగిన చోరీ అలాగే చెన్నూరులోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో చోరీయత్నం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ సంఘటనను జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. దీంతో ప్రత్యేక బృందాలు దొంగల కోసం వేట మొదలు పెట్టాయి. చోరీల విషయమై ఖాజీపేట సీఐ మోహన్ ప్రత్యేక దృష్టి సారించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. అయితే వీరితో పాటు మరో ముఠా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక టీం పరిశీలన చేపట్టారు.

కేసు పరిష్కారంలో సీసీ ఫుటేజ్ కీలకం..

ఖాజీపేట బస్టాండ్ కూడలిలోని బంగారు దుకాణంలో జరిగిన చోరీలో సీసీ ఫుటేజ్ కీలకంగా మారింది. చోరీ చేసిన వారు బంగారు దుకాణంలోని సీసీ ఫుటేజ్‌లు తొలగించారు. అలాగే బయట ఉన్న మరో రెండు సీసీ ఫుటేజ్‌లను తొలగించారు. పూర్తిగా మాస్క్ ధరించి కళ్లజోళ్లు పెట్టుకుని, చేతికి గ్లౌజ్ ధరించి చోరీ చేసి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు దొంగలను గుర్తించడం అసాధ్యంగా మారింది. అయితే మరో సీసీ ఫుటేజ్‌లో చోరీ చేసిన తర్వాత అందరూ ఒకే వాహనంలో వెళ్తున్న దృశ్యం రికార్డు అయింది. ఆ ఫుటేజ్‌లో రికార్డు అయిన వాహనాన్ని పోలీసులు గుర్తించారు. టోల్ గేట్ వద్ద సీసీ ఫుటేజ్‌లోని వాహనాన్ని పరిశీలించారు. అయితే తప్పుడు నంబర్ ప్లేట్ పెట్టుకుని అలాగే టోల్ రుసుం డబ్బులు చెల్లించి వెళ్లడంతో పోలీసుల అనుమానం నిజమైంది. ఈ వాహనం ఆధారంగా దొంగల కూపీ లాగడం మొదలు పెట్టారు. అతికష్టం మీద దొంగల ముఠాను పట్టుకున్నారు.

గండి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



గండి అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆశీస్సుల కోసం శనివారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. శనివారంతో పాటు సెలవులు ఉండటంతో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజలు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

దళితులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వ్యక్తి కాన్‌స్టాన్‌టైన్



కాన్‌స్టాన్‌టైన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : దళితులకు ప్రత్యేక గుర్తింపు తెచ్చి వారికి జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కోవడానికి వారిలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన వ్యక్తి లక్కినేని డేనియల్ కాన్‌స్టాన్‌టైన్ అని సీనియర్ దళిత నాయకుడు, దళిత వెల్ఫేర్ అధ్యక్షుడు ఓ.ఎస్.వి.ప్రసాద్, సంఘమిత్ర సొసైటీ అధ్యక్షుడు సొద్దలపెంచలయ్య పేర్కొన్నారు. కాన్‌స్టాన్‌టైన్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యకు దూరమైన దళితుల కోసం వయోజన విద్యాకేంద్రాలు, మహిళలకు పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి వారిలో విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేశారన్నారు. తొలుత కాన్‌స్టాన్‌టైన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బాస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు యోహాన్, పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకుడు పిచ్చయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేశం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మునెయ్య, దళిత నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బి.మఠం ఎస్‌ఐగా శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బి.శివప్రసాద్, ఎస్.ఐ

బ్రహ్మంగారిమఠం : బి.మఠం నూతన ఎస్‌ఐగా బి.శివప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ఎస్‌ఐ చంద్రశేఖర్ చక్రాయపేటకు బదిలీ అయ్యారు. ఒట్టిమిట్ట నుంచి శివప్రసాద్ బి.మఠంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టాక బ్రహ్మంగారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు రావడం తనకు వరంలాంటిదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉత్సవాలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న డీఈఓ

బద్వేలు అర్బన్ : కష్టపడి చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం బద్వేలు రీజియన్ ఆధ్వర్యంలో ఇటీవల వెలువడిన పది ఫలితాల్లో బద్వేలు, గోపవరం మండలాల్లోని 20 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శనివారం ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలని కోరారు. అలాగే చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, గురువుల పట్ల భక్తి, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వి.సుబ్బారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి, బద్వేలు రీజియన్ అధ్యక్షుడు ఎం.అంకయ్య, ఉపాధ్యక్షుడు జనార్దన్‌రాజు, చెన్నకేశవరెడ్డి, చెన్నకృష్ణ, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణంరాజు, శ్రీనివాసులు, బద్వేలు, గోపవరం మండలాల నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎంఈఓలు చెన్నయ్య, ప్రమీల, విలియంరాజు, సునీల్‌కుమార్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల నిర్మాణంగా అమరావతి



రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : రాష్ట్ర రాజధాని అమరావతిని స్వయం పోషక ప్రాజెక్టుగా అభివర్ణించారు.. నేడు చూస్తే లక్షల కోట్ల అప్పులతో నిర్మాణంగా మారిందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని ఏ రాష్ట్రానికి వెళ్లినా అక్కడి ప్రతిపక్ష పార్టీలపై ఘాటుగా విమర్శలు గుప్పిస్తారన్నారు. కానీ అమరావతిలో జరిగిన సభలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఒక్క విమర్శ కూడా చేయలేదంటే ఆయన నిజాయితీ, సామర్థ్యం గుర్తించినట్లే అన్నారు. ప్రజల డబ్బుతో నిర్వహించిన ఈ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు ఒకరినొకరు పొగుడుకునేందుకే సరిపోయిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఒక్క విషయాన్ని కూడా మోడీని కూటమి నేతలు అడగకపోవడం దారుణమన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న యూనియన్ నాయకులు

బద్వేలు అర్బన్ : కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, 21, 22వ తేదీల్లో మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న సమ్మెపై శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్ల పోరాడి సాధించుకున్న 29 రకాల చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందన్నారు. దీని వలన కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోవడంతో పాటు కార్మికులు బానిసలుగా మారే అవకాశం ఉందన్నారు. ఇలాంటి ప్రమాదకర లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కోశాధికారి శివకుమార్, కమిటీ సభ్యులు కిరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 29 నుంచి అమృతేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ కొవ్వూరు రమేష్ రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానది తీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో 14వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొవ్వూరు రమేష్ రెడ్డి తెలిపారు. ఆలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న ధ్వజారోహణం, గణపతి పూజ, కలశ స్థాపన, 30న దేవతామూర్తులకు అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణం, 31న చండీ హోమం, మహాపూర్ణాహుతి, అష్టాదశ శక్తిపీఠాలకు ఒడిబియ్యం తదితర పూజా కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు టంగుటూరు మారుతిప్రసాద్, ఉపాధ్యక్షుడు వల్లంకొండు మనోహర్, కార్యదర్శి నామా నాగశ్రీనివాసులు, అమృతేశ్వరస్వామి, స్వామి అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

బద్వేలు అర్బన్ : రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలన్నా, ఇచ్చిన హామీలన్నీ అమలు కావాలన్నా అది ప్రత్యేక హోదాతోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో ప్రధాని నరేంద్రమోదీ తిరుపతి వేదికగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మోదీ ప్రత్యేక హోదా ఊసే ఎత్తలేదని, అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సైతం ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా ఉండటం దారుణమన్నారు. ప్రజాపాలన కోసం రాజధాని అవసరమే కానీ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక హోదా అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ తప్పుదారి పట్టిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సంవిధాన్ బచావో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పగడాల నరసింహ, డీసీసీ జనరల్ సెక్రటరీ అచ్యుతరాజు, పీసీసీ సభ్యుడు డాక్టర్ అన్వర్, మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, షామీర్, సాంబయ్య, వెంగయ్య, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంపై దృష్టి సారించాలి

కడప ఎడ్యుకేషన్ : లక్ష్యంపై దృష్టి, శ్వాసపై నియంత్రణ, ఆయుధంపై పట్టు మంచి ఫైరర్‌కు ఉండవలసిన లక్షణాలు అని 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్.సి.సి కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్. సూర్యనారాయణ మూర్తి అన్నారు. తెలుగు గంగ కాలనీలో జరుగుతున్న ఒకటవ కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఎన్.సి.సి క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన ఎన్.సి.సి క్యాడెట్లు రాష్ట్రస్థాయి క్యాంపులో పాల్గొంటారన్నారు.

హనుమంతరావుకు సత్కారం



హనుమంతరావును సత్కరిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలకు ఊపిరి పోస్తున్న నిత్య సాహితీవ్రతులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అని బద్వేలు ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం అందుకున్న హనుమంతరావును శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మహాకవయిత్రి మొల్లమాంబ ఖ్యాతిని జాతీయస్థాయికి తీసుకెళ్లిన ఘనత హనుమంతరావుదే అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, భాగ్యరత్న ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్, పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పలుగురాళ్లపల్లె పంచాయతీలో ఎమ్మెల్యే



కొత్తపల్లెలో రూ.94లక్షలతో ఏర్పాటు చేసిన బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తన స్వగ్రామమైన మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లెలో ఉన్న చెన్నకేశవస్వామి ఉత్సవాల్లో శనివారం పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజల అనంతరం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. అలాగే రూ.94 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, నాయకులు పోలిరెడ్డి, సాంబశివారెడ్డి, గొడ్లవీడు జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రాండ్ లాంగ్ మార్చ్‌ను జయప్రదం చేయాలి



సంఘీభావం తెలుపుతున్న వక్ఫ్ బోర్డు పరిరక్షణ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో ఆదివారం వక్ఫ్ నూతన సవరణ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న గ్రాండ్ లాంగ్ మార్చ్ జయప్రదం చేయాలని వక్ఫ్ పరిరక్షణ జేఏసీ జిల్లా కన్వీనర్ అహ్మద్ బాబు, సిటీ కన్వీనర్ జాకీర్, జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం రాజ్ కళ్యాణ మండపంలో వక్ఫ్ పరిరక్షణ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగే లాంగ్ మార్చ్ నేపథ్యంలో అన్ని పార్టీల ప్రతినిధులతో సభ ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇషాక్ అలీ, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్ర శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, ఎస్ డి పి ఐ రాష్ట్ర అధ్యక్షులు తన్వీర్, నగర కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్, సీపీఐఎం ఎల్ ఓబయ్య, కాంగ్రెస్ గౌస్ పీర్, వైఎస్ఆర్‌సీపీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కడప కార్పొరేషన్ : మున్సిపాలిటీల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన వై. శ్రీరంజన్‌రెడ్డి శనివారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పదవి అలంకారప్రాయం కాకూడదని, అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని సూచించారు.

అనంతరం శ్రీరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పదవి ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.